క్లుప్తంగా

నేడు ఇప్పగూడెం హుండీ లెక్కింపు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శ్రీచింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ బి.లక్ష్మీప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

గుడుంబా పట్టివేత

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారం శివారులో ఓ వ్యక్తి నుంచి నాటుసారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అయ్యల శ్వేత తెలిపారు. శుక్రవారం సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొత్తలపర్రె శివారులో అదే గ్రామానికి చెందిన ముండావర్ బాలాజీ తన ద్విచక్రవాహనంపై రెండు బాటిళ్లలో 4 లీటర్ల నాటుసారాను విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, బాలాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోసిబోయిన బస్టాండ్



స్టేషన్‌ఘన్‌పూర్: గత నాలుగు రోజులుగా మేడారం వెళ్లే భక్తులు, బస్సులతో కిటకిటలాడిన ఘన్‌పూర్ బస్టాండ్ శుక్రవారం బోసిపోయి కనిపించింది. దారులన్నీ మేడారం వైపే అన్నట్లు మెజార్టీ ప్రజలు మేడారం జాతరకు తరలివెళ్లగా నిత్యం రద్దీగా ఉండే ఘన్‌పూర్ బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది.

ఎమ్మెల్యే నందిత మృతి బాధాకరం

పాలకుర్తి : హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం తీవ్ర బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నందిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో గర్భిణి మృతి



స్వాతి మృతదేహం

పాలకుర్తి టౌన్: విద్యుదాఘాతంతో ఆరు నెల గర్భిణి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సింగాపురం తండా గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుగులోతు స్వాతి(23) శుక్రవారం ఉతికిన బట్టలను ఆరవేస్తుండగా ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో తీవ్ర గాయాలైన స్వాతిని కుటుంబ సభ్యులు గమనించి పాలకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందింది. మృతిరాలి భర్త రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై సాయిప్రసన్న కుమార్ తెలిపారు.

భూమిపూజ

వేలేరు : మండల కేంద్రంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ చాడ సరిత శుక్రవారం భూమిపూజ చేశారు. రాజ్యసభ సభ్యుడు కేశవరావు తన నిధుల నుంచి రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించిన మండల కేంద్రానికి చెందిన కుడా మాజీ డైరెక్టర్ బీల్లా యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

చర్య తీసుకోవాలి

వేలేరు : మండంలోని ఎర్రబెల్లి శివారు బైరవు నిబండ వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ముద్దసాని వరుణ్ కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతివార్షిక దివ్యలీల కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అశ్లేషబలి కార్యక్రమం, స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు.

జాతరలకు పోటెత్తిన భక్తులు

- ఇప్పగూడెం జాతరను సందర్శించిన కలెక్టర్ శివలింగయ్య
- తాటికొండ, ఇప్పగూడెంలో భక్తుల సందడి
- చిల్పూరు మండల కేంద్రం, లింగంపల్లి, కొండాపూర్, శ్రీపతిపల్లి, ఫత్తేపూర్ జాతరలో భక్తుల మొక్కులు
- నర్మెట మండలం అమ్మాపురంలో డీసీపీ ఎత్తుబంగారంతో మొక్కులు



స్టేషన్‌ఘన్‌పూర్ : ఇప్పగూడెం జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



స్టేషన్‌ఘన్‌పూర్ : ఇప్పగూడెం జాతరలో కలెక్టర్ శివలింగయ్య



స్టేషన్‌ఘన్‌పూర్ : జాతరలో ఎన్‌పీడీసీఎల్ డీఈ హుస్సేన్‌నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్: వనదేవతలైన శ్రీసమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా మండలంలోని ఇప్పగూడెం–రంగరాయగూడెం చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర, తాటికొండ–జిట్టిగూడెం సమ్మక్క–సారలమ్మ జాతరలో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పగూడెంలో ఈఓ లక్ష్మీప్రసన్న, జాతర కమిటీ మాజీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, ఉత్సవ కమిటీ బాధ్యులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మునిగెల రమేష్, కత్తుల కట్టయ్య, తోట వెంకన్న, ఎస్.అజయ్‌రెడ్డి తదితరులు, తాటికొండలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, చైర్మన్ మహేందర్, కమిటీ బాధ్యులు, ప్రత్యేక అధికారులు, ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వనదేవతలు కొలువుదీరి ఉండగా భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో జాతర ప్రాంగణాల్లో భక్తులతో కిటకిటలాడింది.

ఇప్పగూడెం జాతరను సందర్శించిన కలెక్టర్

మండలంలోని ఇప్పగూడెం సమ్మక్క–సారలమ్మ జాతరను జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మక్క–సారలమ్మ గద్దెలను, ఎల్లమ్మతల్లి గుడిని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, దేవాదాయ ఈఓ లక్ష్మీప్రసన్న, కార్యదర్శులు శ్రీకాంత్, సంతోష్, నాయకులు ఉన్నారు.

సందర్శించిన ఎన్‌పీడీసీఎల్ డీఈ

ఇప్పగూడెం సమ్మక్క–సారలమ్మ జాతరను ఎన్‌పీడీసీఎల్ డీఈ హుస్సేన్‌నాయక్ సందర్శించి వనదేవతలను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం పనిచేసిన సిబ్బందిని ప్రశంసించారు. ఆయన వెంట ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ శివకుమార్, ఎల్ఎం కాల్ రామ్‌నాయక్, సాయిబాబు, సురేందర్, రాము, వెంకటేష్ తదితరులున్నారు.

చిల్పూరు: మండలంలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతరలతో పాటు కొండాపూర్–శ్రీపతిపల్లి, చిల్పూరు, ఫత్తేపూర్ గ్రామాల్లో శుక్రవారం తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పోటెత్తారు. లింగంపల్లి జాతరకు డీపీఓ రంగాచారి దంపతులు రాగా ఈఓ చిందం వంశీ, ఎంపీఓ మధుసూదన్, ఉపాధి హామీ ఈసీ కిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ వెంకన్న, కార్యదర్శులు పూల శ్రీకాంత్, బాపునాయక్, బాలరాజు, రాజులు స్వాగతం పలుకగా ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. చిల్పూరులో చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్, ఉద్దెమారి రాజ్‌కుమార్, జనగాం యాదగిరి, గనగోణి నవీన్, శ్రీపతిపల్లిలో చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ పుట్ట రాజుల ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొ క్కులు చెల్లించుకున్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న డీసీపీ

నర్మెట: శాంతి భద్రతలను కాపాడి ప్రజలను చల్లంగా చూసి పాడిపంటలతో గ్రామాలను పచ్చగా ఉండేలా దీవించాలని అమ్మవార్లను కోరుకున్నట్లు డీసీపీ పి. సీతారాం అన్నారు. మండలంలోని అమ్మాపూర్‌లో శుక్రవారం సమ్మక్క సారలమ్మల జాతరకు విచ్చేసిన ఆయనకు నాయకులు, గ్రామ ప్రజలు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకున్న ఆయన సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌లతో కలిసి ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి రూ.10,116 జాతర అభివృద్ధి కోసం విరాళంగా ఇచ్చారు. మొక్కులు చెల్లించిన వారిలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, ఎంపీటీసీ లక్ష్మి సిద్దయ్య, నాయకులు బాలనర్సు, సురేష్, సురేందర్, రాజ్‌కుమార్, కరుణాకర్, భూపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : తాటికొండలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



బచ్చన్నపేటలో..



చిల్పూరు : లింగంపల్లిలో మొక్కులు తీర్చుకున్న డీపీఓ రంగాచారి



చిల్పూరు: చిల్పూరులో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



నర్మెట : అమ్మాపురంలో ఎత్తు బంగారంతో డీసీపీ, సీఐ, ఎస్సైలు



స్టేషన్‌ఘన్‌పూర్ : నెత్తిన బంగారం(బెల్లం)తో గద్దెల చుట్టూ తిరుగుతున్న భక్తులు

భక్తులకు డాబర్ కంపెనీ వస్తువుల పంపిణీ



వస్తువులను పంపిణీ చేస్తున్న ఎస్సై, ఈఓ

చిల్పూరు : మండలంలోని లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో రూ. 3 లక్షల విలువ చేసే డాబర్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి చెందిన పేస్ట్, వాటిక హేర్ ఆయిల్, రియల్ జ్యూస్‌ను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం ఆర్ఎస్ఎం సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎస్సై వినయ్‌కుమార్, నల్లగొండ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సు మతి, ఈఓ వంశీలు ప్రారంభించి ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఓ రమేష్, ఎస్ఓ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, కౌశిక్, రజ నీకాంత్, వేణు, రాజు, రాజేందర్‌రెడ్డి, రవీందర్, బాలరాజు, విజయ,ఆనందం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీని కలిసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

జనగామ రూరల్: ఇటీవల నూతనంగా ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌రెడ్డిని శుక్రవారం పట్టణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.అసోసియేషన్ అధ్యక్షుడు మందాటి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, పాశం శ్రీశైలం, ఉపాధ్యక్షుడు ఒక్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, కోశాధికారి మత్తిని నర్సింహులు, జలందర్‌రెడ్డి, చందు, ఆంజనేయులు, తదితరులు ఏసీపీని కలిశారు.



ఏసీపీ దామోదర్‌రెడ్డిని కలిసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

'గాంజా శంకర్' టైటిల్ మార్చాలి

జనగామ రూరల్: సంపత్ నంది సాయిధరమ్ తేజ కాంబినేషన్‌లో వస్తున్న గాంజా శంకర్ మూవీ టైటిల్ పేరు మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. శుక్రవారం పట్టణంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంజా టైటిల్ చూస్తుంటే యువత విద్యార్థులు ఎలాంటి మార్గంలో నడవాలో అర్థం కాలేని పరిస్థితి ఉందని అన్నారు.జిల్లా అధ్యక్షుడు సందీప్, సన్మాన్, నరేష్, కిరణ్, రఘు,రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మభిక్షం

నాగాలాండ్ అధికారుల బృందం పరిశీలన

లింగాలఘణపురం: మండల కేంద్రంలో శుక్రవారం నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన ఈసీఎస్ అధికారుల బృందం మహిళా సంఘాల పనితీరుపై పరిశీలించింది. గ్రామైక్య సంఘాల పనితీరు, మండల సమాఖ్య నిర్వహణపై తెలుసుకున్నారు. గ్రామాల్లో సంఘాలు తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి కోసం చేపట్టే ఉపాధి పనులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే శుభాంజలి మండల సమాఖ్యలో సమావేశాల నిర్వహణ, రికార్డుల పరిశీలన, సంఘాలకు ఇచ్చే రుణాలపై చెల్లింపులు తదితర విషయాలను తమ రాష్ట్రంలో మాదిరిగా కాకుండా ఇక్కడ జరుగుతు న్న విధానాన్ని తెలుసుకున్నారు. అందులో ఈసీఎస్ ప్రోగ్రాం మేనేజర్ టి.బెందాంగ్‌షోలా, కోఆర్డినేటర్ మోకుమ్‌లా, ఫీల్డ్ ఆఫీసర్లు ఎల్. సెన్ టీసంగాలా, జాండినోరాఓ,జగన్‌చాబా, మోనుంగ్ సాంగ్ బృందంతో పాటు ఏపీ మాల్ అధికార ప్రతినిధి శ్రీని వాస్, ఏపీఎం శంకరయ్య, శ్రీ కాంత్, వెంకటేశ్వర్లు, మల్లేశం, సంధ్యారాణి, ఉన్నారు.



పనితీరును తెలుసుకుంటున్న నాగాలాండ్ బృందం

గ్రామదేవతలకు ఘనంగా బోనాలు



పోచమ్మతల్లికి బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

బచ్చన్నపేట : రజకుల ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు మండల కేంద్రంలో వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన సుమారు 90 కుటుంబాలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నాయి. రజకులు శుక్రవారం గ్రామ దేవతలకు బోనాలను చేశారు. ముందుగా పోచమ్మ తల్లికి బోనాలను చేసి అందరూ సామూహికంగా శివసత్తుల పూనకాలతో అమ్మవారి వద్దకు వెళ్లి మొక్కులను చెల్లించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో శనివారం అర్చక బృందంచే ఉదయం 11 గంటలకు శివపార్వతుల కల్యాణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రజక కుటుంబాలకు చెందిన వారు పలువురు పాల్గొన్నారు.

రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు



బ్యానర్‌తో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు

స్టేషన్‌ఘన్‌పూర్: డాక్టర్ తాటికొండ రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని కోరుతూ రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతలను శుక్రవారం మొక్కుకున్నారు. మంత్రి పొంగులేటి మనసు మార్చుకోవాలని, డాక్టర్ రాజయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దని బ్యానర్‌ను ఏర్పాటు చేసుకొని మేడారం వరకు ప్రదర్శించారు. కార్యక్రమంలో చింత జ్యోత్స్న, నారగోని పద్మ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లుతున్న దుర్వాసన



మురుగు నీటి కాల్వను చూపిస్తున్న ఇంటి యజమాని

చిల్పూరు: రోడ్డుపై మురుగునీరు పారుతుండడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారని గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేస్తే ఆ నీరు రోడ్డుపై పారకుండా తన ఇంటి ముందు నిలిచేలా చేశారంటూ గ్రామానికి చెందిన కడారి జయపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని పల్లగుట్టలో ఊరు ముందే జనావాసాల ముందే అసంపూర్తి నిర్మాణంతో మురుగు కాల్వను వదిలివేయడంతో గ్రామంలోని ఊరి చివరి నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై పారుతుండగా వచ్చిపోయే వాహన చోదకులతో పాటు చుట్టు పక్కల ఇళ్లలోని ప్రజలు దుర్వాసనకు తోడు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీలో బుధవారం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వారు మొరం పోస్తుండగా ఇక ఇబ్బందులు తీరాయని అనుకుంటే తన ఇంటిముందే నీరు నిలిచేలా చేశారని దీంతో దుర్వాసనతో పాటు దోమల బాధ భరించలేక పోతున్నామని ఇది ఎంత వరకు సమంజసమన్నారు. పంచాయతీ ప్రత్యేకాధికారి ఈవిషయంపై స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

కారు ఢీకొని గొర్రెల మృతి



రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలో ఓ కారు గొర్రెలను ఢీకొనడంతో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన తాటికొండ రమేష్‌యాదవ్ తన గొర్రెలను మేతకు తోలుకెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి తోలుకొస్తున్నాడు. ఈ క్రమంలో కోమల్ల రహదారిపై రోడ్డు దాటిస్తుండగా హనుమకొండ నుంచి అతివేగంగా వస్తున్న కారు గొర్రెలను ఢీ కొట్టింది. దీంతో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి.